

# అనగనగా...కథలు

## - డా.శైలజ చందు



## ఆమె ప్రయత్నం

**రాత్రి ఏడు గంటలయింది**. రేవతి వచ్చే టైమైయింది.

కిచెన్ లోపలికి వెళ్లి చూశాడు. పప్పుచారు తెర్లుతోంది. ములక్కాడలూ, టొమాటోలూ వుడికినట్లే! ఇంగువ డబ్బా ఎక్కడుందో వెతికాడు.

రేవతి వచ్చినట్లు అడుగుల చప్పుడైంది.

కిచెన్లోకి తొంగి చూసి, లోపల్నుండి మరుగుతున్న పప్పుచారు వాసనకు, "అబ్బా... రమణా , థాంక్యూ" అంది.

"స్నానం చేసి వస్తాను. అన్నం పెట్టు నాకు."

"ఇంకొంచం మరగాలి. ఇంతలో అప్పడాలు వేయిస్తా" అన్నాడు.

ఆమె బాత్ రూంలోంచి వచ్చేసరికి పప్పు చారులో తాలింపు వేస్తున్నాడు. ఇంగువ ఘుమాయింపు ఎంతో నచ్చింది, ఆమెకు.

"రా, రా. తొందరగా రా." ప్లేట్ మీద వేలితో కొడుతూ పిలిచింది. రేవతి, ఆకలికి ఆగలేదు.

"రమణా , త్వరగా! రావాలి."

అప్పటికే డైనింగ్ టేబుల్ కళాత్మకంగా సర్దాడు. అన్నం గిన్నె, పప్పు చారు తీసుకు వస్తూ ఆమె వంక చూశాడు, ఎర్రటి నైటీ, మోకాళ్ల కింది వరకూ వుంది. స్లీవ్ లెస్! తెల్లని భుజాలు అదనపు బోనస్!

అరటికాయ వేపుడు, వేడి పప్పు చారు నెయ్యితో తినేస్తోంది. బ్రహ్మ దేవుడొచ్చినా ఆమె ఏకాగ్రత చెదిరేట్టులేదు. తింటుంటే వడ్డిస్తూ, కబుర్లు చెప్తున్నాడు.

తింటూ తింటూ "నీకో మెడల్ ఇస్తానోయ్ రమణా. ఊహూ, మెడల్ కాదు, ఒక టైటిల్ ఇస్తా."

"ఏమిటో?"

"పప్పు చారు సార్వభౌమ!"

నవ్వాడు.

చేతులు కడుక్కుని, నేప్కిన్ తో తుడుచుకుని వస్తూ, “ఇవాళ డిన్నర్ సూపర్.” అంది.

“ఏదీ, ఇంకా మొదలవ్వందే?”

“ఈ వెర్రి వేషాలకేం తక్కువ లేదు” అతని తలమీద మొట్టికాయ వేసి లోపలికెళ్ళింది.

అరగంట గడిచాక, అతనికి దాహంగా అనిపించింది. బయటికి వచ్చి ఫ్రిజ్ నుండి జ్యూస్ తీసుకుని గ్లాసులో పోసుకున్నాడు.

ఫ్రిజ్ డోర్ మీద ఎర్ర నైటీ నీడ కనిపిస్తోంది. అతను వెనక్కి తిరగలేదు.

లివింగ్ రూమ్‌లో సోఫాపై కూర్చుని, టీవీ చూస్తూ రిమోట్ నొక్కుతోంది. అతను జ్యూస్ గ్లాస్ తీసుకుని వచ్చాడు.

"వేరే జ్యూస్ తాగరాదూ." అంది.

ఏమిటన్నట్టు చూశాడు.

"అదే జ్యూస్ బ్రాండ్ మార్చు."

జవాబు చెప్తే సంభాషణ ఎటు నడుస్తుందో ఏమవుతుందో తెలుసు.

మౌనంగా వున్నాడు.

"పోనీ ఈ సారి, అరగంట ముందే తాగు."

అతనేమీ మాట్లాడడం లేదని,

“నిన్నే, పీ సి ఎస్!”

“పీ సి ఎస్! అంటే, పి సి సర్కారా?”

“అవును. పెద్ద నీకు మాజిక్ వచ్చినట్టు. పి సి ఎస్ అంటే, పప్పు చారు సార్వభౌమ.”

తను వేసిన జోక్ కి తనే నవ్వుతోంది.

ఎర్రటి నైటీ!

ఎర్రటి నవ్వు.

ఎర్రటి వెటకారం.

పైన టెర్రేస్ మీదకు వెళ్లి చాప పరిచాడు. రెండు చేతులూ తలకింద పెట్టుకుని వెల్లికిలా పడుకున్నాడు,

అతను ఆలోచిస్తున్నాడు.

'పెళ్లయి నాలుగేళ్లవుతోంది.  ఎన్నో సార్లు హేళన చేయడం, వెటకరించడం, నవ్వడం. అదేమంటే ఇక జోకులు , సరదాలు తెలియవంటూ, 'జస్ట్ కిడ్డింగ్, బీ ఎ స్పోర్ట్' లతో సరిపుచ్చడం.

తానేమీ తినలేదన్న విషయం, కడుపు గుర్తు చేసింది. దానికి జవాబు చెప్పే వుద్దేశమూ లేదు.

పైన నక్షత్రాల పందిరి. 'ఈ విశ్వంలో ఎన్నో గ్రహాలుంటాయి. ఏదో ఒక గ్రహం నుండి ఎవరైనా నన్ను గమనిస్తూ వుంటారా? ఒక్కరికైనా బాధ అర్థం అవుతూ వుంటుందా?  ఒక్కరైనా స్నేహాన్నందించడానికి రాకూడదా?'

పక్కకు తిరిగాడు. దిండు తడిసిపోతుండగా, ఆ తడిలోనే నిద్రలోకి జారుకున్నాడు. కొంత సేపటికి అతన్ని చల్లగాలి చుట్టు ముట్టింది. పారిజాత పరిమళాల తెమ్మెర. అతని కన్నీటి తడి ఎండిపోయింది. ముడుచుకుని పడుకున్నాడు. ఎవరో అతనిని వడిలోకి తీసుకున్న భావన. మెత్తగా అతని చెంప నిమురుతూ.

ఉదయం లేచేసరికి ఏడయింది. కిందికి వెళ్లాలంటే జంకుగా వుంది. ఏయే వెటకారాల శూలాలు గుచ్చుకుంటాయోనన్న భయం.

''రేవతి ఇంట్లో లేకపోతే బాగుండు.' అనుకున్నాడు

కిందికెళ్లడానికి మనసొప్పక, టెర్రేస్ మీద అటూ ఇటూ పచార్లు చేశాడు. స్కూలు కెళ్లడం ఇష్టం లేని పిల్లవాడిలా.

'రేవతి ఆమెకెదురు పడాలని లేదు! '

'ఆఫీసుకు టైమవుతోంది. తప్పదు వెళ్లాలి.'

తన చాపా, దిండూ తీసుకుని అపార్ట్మెంట్ లిఫ్ట్ దగ్గరకు వెళ్లాడు. రాత్రి అనుభవించిన పరిమళం ఇంకా అతన్ని వదల్లేదు.

'రాత్రి చల్లగాలి, ఫ్రాగ్రన్స్, మెత్తటి వడి , ఎంత బాగుంది కల.' అనుకున్నాడు.

'ఎవరో ఆమె. ఇప్పుడున్న పరిస్థితికి తోడు ఈ భ్రమలు , హెలూసినేషన్స్! వత్తిడికి ఇవి సైడ్ ఎఫెక్ట్సా?'

నవ్వుకున్నాడు.

తమ ఫ్లాట్ దగ్గరెళ్లి చూస్తే తలుపు వేసి వుంది. బెల్ కొడితే తియ్యలేదు. రేవతి ఇంట్లో వున్నట్టు అనిపించలేదు. తాళం ఏ కుండీలో పెడుతుందో తెలుసు. తాళం తీసి ఇంట్లో కెళ్లాడు. వంటింటి నుండి, సూర్యకాంతి లివింగ్ రూంలోకి పడుతోంది

మెత్తని వెలుగు. ఇంట్లో నిశ్శబ్దం. డైనింగ్ టేబుల్ మీద రేవతి రాసిన నోట్ వుంది.

'ఫ్రెండ్స్ , సర్ప్రైజ్ గోవా ట్రిప్ ప్లాన్ చేశారని. అటు నుండి ఇంకెటో వెళ్తారని, పదిరోజులవరకూ రాన'ని వుంది.

పది రోజులా? కిచెన్లోకి వెళ్లి కాఫీ చేసుకుని  నెమ్మదిగా తాగాడు. బెడ్ రూమ్ లోకి వెళ్లాలనిపించలేదు. స్నానం చేసి మెత్తటి తెల్ల చొక్కా వేసుకుని వెళ్లబోతూ, కారు తాళం వెతికితే కనిపించలేదు. రాత్రి వేసుకున్న చొక్కా జేబులో చూశాడు.

ఓ పారిజాతం!

ఎర్రని కాడ వున్న తెల్లని పారిజాతం!!

ఉలికి పడ్డాడు. అపార్ట్మెంట్ లో పారిజాతపు చెట్టు వుందా?

ఉన్నాగానీ, టెర్రేస్ మీద పడుకున్న నా జేబులోకెందుకొస్తుంది?

❦❦❦

కార్లో ఆఫీసుకు వెళ్తున్నాడు. బ్రిడ్జ్ కింద నుండి వెళ్తే త్వరగా వెళ్లొచ్చనుకుని అటుగా వెళ్తున్నాడు. అక్కడకూడా ట్రాఫిక్ తక్కువేమీ లేదు.  కొద్ది సేపు వాహనాలన్నీ ఆగాయి. ఒకసారెందుకో పైకి చూశాడు.

బ్రిడ్జ్ పైన పిట్ట గోడ మీంచి పిల్లలు గాలిపటాలు ఎగరేస్తున్నారు. ఒకడి గాలిపటం తెగిపోయి, బ్రిడ్జి కింది అంచుకు వేళాడుతోంది. వాడు పిట్టగోడ ఎక్కి, దిగాలని చూస్తున్నాడు, దాన్ని తెచ్చుకోవడానికి! వాడు పడతాడేమో!

అనుకున్న వెంటనే వాడు నిజంగా జారి పడ్డాడు. అప్పుడే ట్రాఫిక్ కదిలింది. మెల్లగా వేగం పుంజుకుంటోంది.

‘ఓ మైగాడ్! ట్రాఫిక్ లో పడితే ఇంకేమైనా వుందా.  ఎలా అయినా వాడు సేఫ్ గా వుండాలి. ఏదైనా ఒక  పచ్చగడ్డి ట్రక్ మీద పడితే బాగుండు.’ అనుకున్నాడు.

రియర్ వ్యూ మిర్రర్ లో చూశాడు , ‘ఏమైనా ప్రమాదం జరిగిందా?’ అని.

అంతా మామూలుగానే వుంది.  కార్ ఓ పక్కకు తీసి ఆపాడు, రోడ్డు మీద ఎవరైనా పడ్డారా అని చూసేందుకు.

ట్రాఫిక్ మామూలుగానే వెళుతోంది. యాక్సిడెంట్ అయిన సూచనలేమీ లేవు.

❦❦❦

ఆఫీసుకెళ్లే సరికి బాగా లేటయ్యింది.

‘మేనేజర్ ఏమంటాడో. అసలే కోపిష్టి. తనే మేనేజర్ అయితే బాగుండు. ఏ గొడవా వుండదు.’ అనుకుంటూ లోపలికి వెళ్ళి డెస్క్ దగ్గర కూర్చున్నాడు.

అటెండర్ వచ్చి, రీజినల్ హెడ్ వచ్చారండి. మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు.

‘ఏమవుతుందో దేవుడా.’ అనుకుంటూ లోపలికి వెళ్లాడు.

“వెంకట్, ప్రస్తుత మేనేజర్ రామ్ ను ముంబై బ్రాంచ్ కు ట్రాన్స్ఫర్ చేస్తున్నాను. మీగురించి ఎప్పటి నుండో వింటున్నాను. ఈ బ్రాంచ్ బాధ్యతలు ఒప్పగించడానికి సరి అయిన వ్యక్తి మీరేనని నా అభిప్రాయం.”

నమ్మలేకపోయాడు వెంకట్.

మనసులో ఏమనుకుంటే అవి అవుతున్నాయేమిటి.

విషయం తెలిసిన ఆఫీసు కొలీగ్స్ చిన్న పార్టీ వంటిది యేర్పాటు చేశారు. స్వీట్స్, టీ తెప్పించారు. అతన్ని గురించి నాలుగు మంచిమాటలు మాట్లాడి, అభినందిస్తూ ఒక బొకే ఇచ్చారు.

ఎర్ర పూల బొకే!

దాన్ని అతని ఆఫీసు గదిలో టేబిల్ మీద వుంచారు.

ఎర్రపూలను చూస్తుంటే రాత్రి ఎర్ర నైటీ గుర్తు వచ్చి అతని మనసు బాధగా మూలిగింది.

'ఎర్రపూలు వద్దు. అవి తెల్లవైతే బాగుండు' అనుకున్నాడు.

మెల్లగా అవి రంగు మారుతున్నాయి. తెల్ల గులాబీలయ్యాయి.

గడ్డ కట్టినట్టు బిగుసుకుపోయాడు.

ఇలా అనుకుంటే అలా అయిపోతోందేమి. యాదృచ్ఛికమా ఇది? కాదు. ఉదయం నుండీ ఏదనుకుంటే అది అయిపోతోంది. ఆలోచిస్తుంటే తల నాదుగా అనిపించింది.

ఆ రోజు ఆఫీసు పని ఎక్కువగా వుంది. పైగా కొత్త బాధ్యతలు. లంచ్ టైం వరకూ వూపిరాడ లేదు. అతనొక్కడే కాంటీన్ కు వెళ్లాడు.

అక్కడున్న టివీలో ఒక న్యూస్ యాంకర్ మాట్లాడుతోంది.

"దురదృష్టం కిందికి తోస్తే, అదృష్టం అరచేయి పట్టి కాపాడిందట. అలా వుంది ఈ బుడ్డోడి లక్. లేవగానే ఎవరి మొహం చూశాడో, ఏ నక్కని తొక్కాడో కానీ వీడికింకా భూమ్మీద నూకలున్నాయి. జరిగింది వింటే మీరే ఆశ్చర్యపోతారు.

పక్కా థ్రిల్లర్ మూవీని తలపించే విజువల్స్ మీరే చూడండి.

చూస్తున్నాడు.

తను వచ్చిన రూట్ లోనే, బ్రిడ్జ్ మీంచి పిల్లవాడు పడిపోతున్నాడు. వెంటనే పచ్చగడ్డి ట్రక్ వచ్చింది. భద్రంగా దాని మీద పడ్డాడు.

తను కారు పక్కకు ఆపడం, దిగి యాక్సిడెంట్ అయిందేమోనని చూడడం, అవి కూడా వీడియోలో రికార్డ్ అయింది.

వెన్నులోంచి చిన్నగా వణుకొచ్చింది. జరుగుతున్నవి యాదృచ్ఛికం కాదు. మనసులో ఆలోచన పుట్టడం ఆలస్యం, జరిగిపోతున్నాయి.

సాయంత్రం వరకు, ఆఫీసు పనితో తీరికలేకుండా గడిపాడు. పార్కింగ్ లాట్ కి వచ్చేసరికి చీకటి పడుతోంది. దూరంగా ఎవరో మెర్సిడెస్ లో వెళ్తున్నారు. ఎప్పటినుండో అతనికి మెర్సిడెస్ లో వెళ్లాలని కోరిక.

'నాకొక బ్లూ మెర్సిడెస్ సొంతమైతే బాగుండు' అనుకుని, నాలిక్కరుచుకుని వెంటనే కళ్లు మూసుకున్నాడు.

తెరవాలంటే భయమేసింది. ఎవరో వెనక నుండి మెల్లగా నెడుతున్నట్లు చిన్న వత్తిడి. వెనక్కి తిరిగి చూస్తే ముదురు నీలం రంగులో మెరుస్తూ వుంది మెర్సిడెస్. చేతిలో వున్న తన కారు కీ చూశాడు. అది తన పాత కీ కాదు. బెంజ్ గుర్తు వుంది.

క్లిక్ , క్లిక్ అన్న సౌండ్ వచ్చింది. నెమ్మదిగా వెళ్లి, కారు డోర్ తీశాడు భయపడుతూ. ఆహ్వానించినట్లు మెత్తగా తెరుచుకుంది.

లోపల కూర్చుంటే కాళ్లు ఆక్సిలరేటర్ కు, బ్రేక్ కు సరైన దూరంలో వున్నాయి. డాష్ బోర్డ్ తెరిచాడు. తన డ్రైవింగ్ లైసెన్స్, తన పేరు మీద ఆర్ సి బుక్ , ఇంకేవో పేపర్స్ వున్నాయి.

వెన్నులో జలదరింపు. మనసు మాట్టాడడం మానేసింది. మొద్దుబారినట్టు కంగారుగా వుంది.

ఆఫీసునుండి ఇంటికి దాదాపు ఏడెనిమిది కిలోమీటర్ల దూరం వుంది. రెండు కిలో మీటర్లు పోయాక, తను

స్టీరింగ్ ని గట్టిగా పట్టుకున్నాడని తెలిసింది. అరచేతులు తడిగా వున్నాయి. కార్లో ఏసీ వణిస్తోంది.

'వెచ్చగా వుంటే బాగుండు. ఈ కార్లో ఏసీ కంట్రోల్ ఎలానో?' అనుకున్న మరుక్షణమే వెచ్చదనం వచ్చింది.

ఏవో ఇంగ్లీషు పాటలొస్తున్నాయి. 'అదేదో నాకిష్టమైన పాట. ఏమిటా పాట ...

మూగ కోరిక అని వస్తుంది మధ్యలో..ఏవిఁటదీ?' అనీ ఆలోచిస్తుండగానే చటుక్కున బాలూ, సుశీల వచ్చి పలకరించారు.

మూగ కోరికా, ముసిరే దాకా

మూసిన పెదవికీ తెలియదు

ఏమనీ?

తానొక ముద్దుకై తహ తహలాడేననీ.

ఆ కోరికలే ఇద్దరిలోనా కార్తీక పూర్ణిమలై వెలగాలీ.

గుండె దడ దడలాడుతుండగా ఇంటికొచ్చి తలుపు మూశాడు. గడియ పెట్టుకున్నాడు. ఏది అనుకుంటే అది జరుగుతోంది.

కళ్లు మూసుకుని ఆలోచించాడు. ఇలా కాదు. మనసులో ఆలోచనలు వెంటనే జరక్కూడదు.

పేపర్ మీద కొన్న కండిషన్స్ వ్రాస్తాను. వాటి ప్రకారమే జరగాలి. మనసులో ఆలోచనలు వెంటనే జరిగిపోకూడదు.

గట్టిగా శాసించినట్టు మనసులో అనుకున్నాడు.

ఒక పేపర్ తీసుకున్నాడు. ఏదైనా జరగడానికి నిబంధనలు.

1. మనుషులెవరూ కనిపించని ఏకాంతం

2. కళ్లు మూసుకోవాలి.

3. తనకి ఏమి కావాలో నోటితో పలకాలి.

ఈ పై మూడూ అంశాలు కుదిరినపుడే తను చెప్పిన మాట నెరవేరాలి. ఈ పేపర్లో రాసిన ప్రకారమే జరగాలి. అవును అంతే!!!

పెన్ను టిప్ తో పేపర్ ని గుచ్చాడు. కంగారు తగ్గినట్లైంది. గుండె వేగమూ తగ్గింది.

మెల్లగా నిట్టూర్చాడు.

ఒక సారి టెస్ట్ చేసి చూద్దామని, 'జీడిపప్పు వేసిన సేమ్యా , సగ్గుబియ్యం పాయసం కావాలి.' కళ్లు తెరిచి , మనసులో అనుకున్నాడు.

ఏమీ జరగలేదు.

మరో సారి పాయసం కావాలని అనుకున్నాడు.

ఏమీ జరగలేదు.

ఈ సారి, కళ్ళు మూసుకున్నాడు.

"జీడిపప్పు వేసిన సేమ్యా , సగ్గుబియ్యం పాయసం కావాలి. " వినిపించేలా అన్నాడు.

తలుపు తడుతున్నారెవరో ,'టక్, టక్' అంటూ.

పాయసం ప్రత్యక్షమవలేదు. జరగలేదేమి?

మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. పెద్దగా స్పష్టంగా అన్నాడు.

"పాయసం కావాలి."

బయట డోర్ మరింతగా చప్పుడవుతోంది.

"ఎవరూ !" విసుక్కుంటూ తలుపు తీశాడు.

పక్కింటి పాప నిలబడి వుంది. "అంకుల్, నా హాపీ బర్త్ డే. అమ్మ ఇచ్చి రమ్మంది"

పాప చేతిలో పాయసం కప్పు.

లోపలికొచ్చి కూర్చున్నాడు.

అంటే, ముందు తను కళ్లు మూసుకోవాలి. మనుషులెవరూ వుండకూడదు. పెద్దగా చెప్పిన మాటే జరుగుతుంది.

మనసు స్థిమిత పడింది.

'కానీ ఏం కావాలి తనకు. ఏం కోరుకోవాలి?'

"ప్రశాంతత కావాలి. ఏకాంతం కావాలి." కళ్లు మూసుకుని అన్నాడు.

రాత్రులు టెర్రేస్ మీద పడుకుంటున్నాడు.

పరిమళ భరితమైన రాత్రులు.

ప్రతి రాత్రీ ఒక సౌందర్యమూర్తి తనకు తోడుగా మసలుతున్న వునికి తెలుస్తోంది. ఆమె తెల్లని దుస్తులు వేసుకుంటుంది.

చందనపు పరిమళంతో అతన్ని చుట్టు ముడుతోంది. సౌమ్యమే అలంకారం. ఓదార్పే ఆమె భాష. అప్యాయతతో దగ్గరకు తీసుకుంది.

చెంపలు సవరించుతూ, మనసుని చల్లగా పెనవేసుకుంది. అతన్ని గుండెల్లో దాచుకుంది. అతని దుఃఖానికి తోడుగా నిలబడింది. ధీరుడికి మాత్రం దుఃఖముండదా? హృదయమున్నందుకే కదా బాధ!

ఆమె ఎవరో, ఏమిటో తెలియదు. పేరు సైతం అడగలేదు. జరుగుతున్న విచిత్రాలన్నీ ఆమె వల్లనే అన్న సత్యమొక్కటి తెలుసు అతనికి.

అది పదవ రోజు. మర్నాడే రేవతి వచ్చే రోజు. ఎరగని దుఃఖం అంతమైన పదవ రోజు.

ఆ రోజు ఆమె జడలోని మల్లెలు అతని చెంపల్ని, మెత్తగా చెళ్లుమనిపిస్తున్నాయి. మత్తుతో అతని కళ్లు మూతలు పడుతున్నాయి. చల్లని ఆమె స్పర్శ సెగలు రేపుతోంది.

అతని హృదయాన్ని, వేలితో గుచ్చి, "ఇక్కడున్న బాధనంతా నాకిచ్చేయి." అంది.

అతనిలో సగభాగం కోసం పోరాడింది ఆమె.పోరాడి నందుకు సిగ్గు పడింది. ఆ సిగ్గు అతన్ని స్వర్గాధిపతిని చేసింది.

ఎనలేని కృతజ్ఞతతో అతను కళ్లు మూసుకున్నాడు. నుదుటి మీద ముద్దు పెట్టింది.

జీవితానికొక నిశ్చింత కలిగింది.

రెండు కళ్లమీదా చల్లని స్పర్శ, ప్రాణానికి వెచ్చని హాయి కలిగించింది. ముక్కుకేదో చిత్రమైన ముచ్చట జరిపింది.

అతని పెదవులు చిరు నవ్వు వంపు తిరిగాయి.

పెదవుల్ని వేలితో రాస్తూ, 'కళ్ళు తెరువు' అంది. 'కళ్లు తెరిస్తే, ఈమె మాయమైపోతుందేమో.' అనుకున్నాడు మనసులో.

అతను, తన మనసులోని అనుమానం చెప్పబోయాడు. అతను తప్ప వేరే మనిషి లేని ఏకాంతం.

కళ్ళు మూసుకుని వున్నాడు. పైకి చెప్పబోతున్నాడు.

"కళ్లు తెరిస్తే నువ్వు మాయ.." అతని పెదవులు పలకబోతున్నాయి. జరగబోయే ప్రమాదాన్ని ఆమె పసి గట్టి, వేగంగా కదిలింది.

అతను చెప్పబోయే వాక్యాన్ని పూర్తి చేయకుండా ఆపాలని ఆమె ప్రయత్నం!!

***(వచ్చే నెల మరో అనగనగా.....)***

Post your comments